వలంటీర్ల పనితీరు అభినందనీయం

మాట్లాడుతున్న పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం, ఫిబ్రవరి 13: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కనీస సామర్థ్యాలపై అవగాహన కల్పించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ 1, 2 వలంటీర్ల పనితీరు అభినందనీయమని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ జాన్ మిల్టన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీవో మాట్లాడారు. ప్రతి శనివారం పట్టణంలోని వివిధ కాలనీలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు చదువుపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మక్కువ కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు యూనివర్సిటీ ఫీజు ఆర్థిక భారంగా మారిందని పీవోకు తెలపగా స్పందించిన ఆయన విద్యార్థుల ఫీజును ఐటీడీఏ భరిస్తుందని అభయమిచ్చారు.

బొగ్గు గనుల్లో రక్షణ సూత్రాలు పాటించాలి

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

గనిలో పర్యటిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

మణుగూరు టౌన్, ఫిబ్రవరి13: బొగ్గు గనుల్లో పూర్తిస్థాయి రక్షణ సూత్రాలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జీ.వెంకటేశ్వరరెడ్డి సూచించారు. అలాగే భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సింగరేణి మణుగూరు ఏరియాలో సోమవారం పర్యటించిన ఆయన.. జీఎం దుర్గం రామచందర్‌తో కలిసి కొండాపురం భూగర్భ గనిని పరిశీలించారు. కంటీన్యూయస్ మైనర్ యంత్రం ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ గురించి అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించారు. అనంతరం పీకేఓసీ-2, ఓసీ-4, మణుగూరు ఓసీ గనులను సందర్శించారు. సింగరేణి అధికారులు, ఇంజినీర్లు వీసం కృష్ణయ్య, నర్సిరెడ్డి, లక్ష్మీపతిగౌడ్, వీరభద్రరావు, శ్రీనివాసాచారి, రాంబాబు, వీరభద్రుడు, రవీందర్, వెంకటేశ్వర్లు, రాజేశ్వరరావు, మధుబాబు, లింగబాబు, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

సింగరేణి పరిధిలో సర్టిఫికెట్ల డిజిటలైజేషన్

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 13 : సింగరేణి సంస్థలో ఉద్యోగులు, కార్మికుల సర్టిఫికెట్లను డిజిటలైజేషన్ చేస్తున్నామని, దీనివల్ల ట్రాన్స్‌పరెన్సీతోపాటు కార్మికులు ఉద్యోగ విరమణ చేసిన సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్ అండ్ పా) ఎన్‌వీకే శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో సింగరేణిలో బొగ్గు అక్రమ రవాణా జరుగుతోందని అనేక ఆరోపణలు వస్తున్నాయని, అలా జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిసెంబర్ 27న జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించి ఉత్తర్వులు ఆర్ఎల్‌సీ నుంచి ఇంకా రాలేదని, అధికారికంగా నియామక పత్రం వచ్చిన తర్వాత కార్మికుల సమస్యలపై చర్చిస్తామన్నారు. ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొనకుండా కార్మిక సంఘాలతో చర్చలు జరుపుతున్నామన్నారు.

కేటీపీఎస్ ఏడోదశను సందర్శించిన జెన్కో డైరెక్టర్

అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ లక్ష్మయ్య

పాల్వంచ, ఫిబ్రవరి 13 : టీఎస్ జెన్కో డైరెక్టర్(థర్మల్) బి.లక్ష్మయ్య కేటీపీఎస్ ఏడో దశను మంగళవారం సందర్శించారు. కోల్‌ప్లాంట్, ట్రాల్‌హాపర్, వ్యాగన్‌టిప్లన్, స్టాకర్‌యార్డు, యూనిట్ సైడ్ స్విచ్‌యార్డు, మెయిన్ కంట్రోల్‌రూమ్, సైలో సిస్టంని పరిశీలించారు. సింగరేణి సంస్థ నుంచి నాణ్యమైన బొగ్గు ఇప్పించేందుకు కృషిచేస్తామని, విద్యుదుత్పత్తి చేసేందుకు ఇంజినీర్లు, కార్మికులు సమష్టి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో సీఈ వెంకటేశ్వరరావు, ఎస్ఈలు గుర్రం రాజ్‌కుమార్, శ్రీనివాసరావు, ఎస్ఎన్ఎస్ శేఖర్, కోల్‌ప్లాంట్ డీఈలు హరిలాల్, శ్రీనివాసరావు, కే.రాంబాబు, వెంకటేశ్వర్లు, బి.రవి, శ్రీనివాసరావు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

నేడు గ్రిడ్‌కు సోలార్ పవర్ అనుసంధానం

రామవరం, ఫిబ్రవరి 13 : సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరం పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న 10.5 మెగావాట్ల సోలార్ పవర్‌ప్లాంట్‌ను బుధవారం గ్రిడ్‌కు అనుసంధానం చేయనున్నట్లు డైరెక్టర్(ఈఅండ్ఎం) సత్యనారాయణ అన్నారు. రూ.56 కోట్ల వ్యయంతో 49 ఎకరాల్లో నిర్మిస్తున్న ఈ సోలార్ పవర్‌ప్లాంట్ గ్రిడ్‌కు అనుసంధానం అయితే గతంలో ఉన్న 37 మెగావాట్లతోపాటు అదనంగా 10.5 మెగావాట్ల సోలార్ కలిపి మొత్తంగా 47.5 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి జరగనున్నది. ఆయనవెంట సోలార్ జీఎం జానకీరాం, జీఎం వర్క్‌షాప్, ఇంజినీర్ దుర్గాప్రసాద్, ఏరియా వర్క్‌షాప్ ఎస్ఈ శ్రీకాంత్ పాల్గొన్నారు.

‘ఎస్ఏ’ మూల్యాంకన తనిఖీ

రామవరం, ఫిబ్రవరి 13: రామవరం ఎస్‌సీబీ నగర్ మోడ్రన్ ఇక్రా స్కూల్‌లో జరుగుతున్న పదో తరగతి ఎస్ఏ పరీక్షల మూల్యాంకనాన్ని మంగళవారం బృంద అధికారి కల్యాణ్‌శర్మ తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి అతి ముఖ్యమైన మెట్టు అని, బాగా చదవాలన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
కావలెను
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319437-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

దారులన్నీ నల్గొండ వైపే..

ఇల్లెందు: సభకు తరలివెళ్తున్న నాయకులు

ఇల్లెందు, ఫిబ్రవరి 13: కృష్ణా ప్రాజెక్ట్‌లను కేంద్రానికి తాకట్టుపెట్టిన రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మంగళవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నల్గొండలో నిర్వహించిన బహిరంగ సభకు ఇల్లెందు మండలం నుంచి పార్టీ నాయకులు దిండిగాల రాజేందర్, ఎస్.రంగనాథ్, దేవీలాల్, ఎర్రబెల్లి కృష్ణయ్య, కృష్ణారావు, గిన్నారపు రాజేష్, నబీ, రవితేజ, సంతోష్, చాంద్‌పాషా, సర్దార్, శ్రీకాంత్, రాజశేఖర్ తరలివెళ్లారు.

అన్నపురెడ్డిపల్లిలో...

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 13 : నల్లగొండలో నిర్వహించిన బీఆర్ఎస్ సభకు మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు తరలివెళ్లారు. మంగళవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు సభకు వాహనాలలో తరలివెళ్లారు.

సారపాక

సారపాక, ఫిబ్రవరి 13: కృష్ణా జలాల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తలపెట్టిన చలో నల్గొండ సభకు బూర్గంపహాడ్ మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. ఆయా గ్రామాల నుంచి మంగళవారం బయలుదేరిన ఈ ప్రత్యేక వాహనాలను బీఆర్ఎస్ నాయకులు గులాబీ జెండాలు ఊపి ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు జలగం జగదీశ్, బిక్కసాని శ్రీనివాసరావు, వల్లూరిపల్లి వంశీకృష్ణ పాల్గొన్నారు.

సమ్మక్క- సారక్క జాతరబోయొద్దమా!

టేకులపల్లి: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

జూలూరుపాడు: ముస్తాబైన సమ్మక్క- సారలమ్మ గద్దెలు

జాతర పోస్టర్ ఆవిష్కరణ

టేకులపల్లి, ఫిబ్రవరి 13: పాలమడుగులో వచ్చే వారంలో జరిగే సమ్మక్క సారక్క జాతరకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం జెండాలతండాలో నిర్వాహకులు ఆవిష్కరించారు. జాతరలో జరిగే పూజలకు ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శంకర్‌నాయక్, వివిధ సంఘాల నాయకులు హతిరాం, సురేందర్, అజ్మీరా గలక, గంగారాజు పాల్గొన్నారు.

నేటి నుంచి వనదేవతల జాతర

జూలూరుపాడు, ఫిబ్రవరి 13 : మండలపరిధి పడమటనర్సాపురం గ్రామ సమీపంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న గుట్ట సమీపంలో మినీ మేడారంగా ప్రసిద్ధి చెందిన శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతర ఈ నెల 14, 15, 16, 17వ తేదీల్లో నిర్వహించనున్నారు. జాతర నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో పనులు పూర్తయ్యాయి. ప్రతి రెండేళ్లకొకసారి జరిగే ఈ జాతరకు భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చి వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. 14వ తేదీన పుట్టబంగారంతో వనం నుంచి సారలమ్మను గద్దె మీదకు తీసుకొస్తారు. 15న సమ్మక్కను గద్దె మీదకు తీసుకరాగా 16న భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటారు. తిరిగి సమ్మక్క-సారలమ్మను 17న వనంలోకి సాగనంపుతారు.

సంక్షిప్తం

కలప పట్టివేత

పర్ణశాల, ఫిబ్రవరి 13: మండలంలోని చిన్నబండ్రేవు గ్రామంలో కొందరు వ్యక్తులు అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన టేకు దిమ్మలను ఫారెస్టు టాస్క్ ఫోర్స్ అధికారులు మంగళవారం రాత్రి దాడి చేసి పట్టుకున్నారు. చిన్నబండ్రేవులోని పెట్రోల్ బంక్ సమీపంలో ఒక ఇంటికి వెనుక ఉంచిన ఈ టేకు దిమ్మలను ఉంచారని సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ రేంజర్ ప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు దాడి చేసి టేకు దిమ్మలను స్వాధీనం చేసుకుని దుమ్ముగూడెం అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించారు. వీటి విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని తెలిపారు.

డిగ్రీ కళాశాల సందర్శన

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 13 : మండలంలోని లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ కళాశాలలో ఉన్న జాతీయ సేవా పథకం పనితీరును పరిశీలించేందుకు రాష్ట్రస్థాయి బృందం మంగళవారం కళాశాలను సందర్శించింది. సేవా పథకంలోని వలంటీర్లు ఏవిధంగా పనిచేస్తున్నరో తెలుసుకున్నారు. పేద విద్యార్థుల అభివృద్ధికి చేయాల్సిన కార్యక్రమాలను వారికి వివరించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నప్పయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, డాక్టర్ పూర్ణచందర్‌రావు, నారాయణ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా

భద్రాచలం, ఫిబ్రవరి 13: ఎన్‌టీఏ విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాల విద్యార్థిను ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల డైరెక్టర్లు మాగంటి ప్రసాద్‌బాబు, మాగంటి రమేశ్‌బాబు తెలిపారు. కేలోత్ సాహితీ 76.75మార్కులు, భూక్యా నిహారిక 57.39శాతం మార్కులు సాధించారని పేర్కొన్నారు. విద్యార్థినులను డైరెక్టర్లు, మ్యాథ్స్ అధ్యాపకులు బషీర్ అభినందించారు.

రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు విద్యార్థి

జూలూరుపాడు, ఫిబ్రవరి 13 : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి చొప్పకట్ల హరీంద్రనాథ్ వార్దేయ ఈ నెల 12వ తేదీ జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనర్సు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

బ్యాంక్ ఖాతాలు తెరవాలి

జూలూరుపాడు, ఫిబ్రవరి 13 : ట్రైకార్ రుణాల కోసం 2020-21, 22 ఆర్థిక సంవత్సరాల్లో ఎంపికైన మండలంలోని 89 మంది లబ్ధిదారులు బ్యాంకు ఖాతాలను వెంటనే తెరిచి రుణాలను గ్రౌండింగ్ చేసుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు మగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. రెండు పాస్‌ఫొటోలు, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు జిరాక్స్ తీసుకెళ్లి బ్యాంక్ మేనేజర్‌ని కలిసి ఖాతా ఓపెన్ చేయాలన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో విధ్వంసం

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 13: మితిమీరిన ప్లాస్టిక్ వినియోగంతో మున్ముందు పర్యావరణ విధ్వంసమవుతుందని పంచాయతీ కార్యదర్శి మోజెస్ అన్నారు. మొండితోగు ప్రభుత్వ బడిలో మంగళవారం విద్యార్థులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వస్తువులు భూగర్భంలో కలవడానికి వందల ఏళ్లు పడుతుందని, తద్వారా జీవకోటికీ నష్టం వాటిల్లుతుందన్నారు.

కరాటేలో జిల్లా క్రీడాకారులకు పతకాలు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 13 : హైదరాబాద్‌లో జరిగిన 3వ అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు పతకాలు సాధించారు. లికిత్ చరణ్ బంగారు పతకం, ఎం.గ్లోరీ ప్రశస్త బంగారు పతకం, సీహెచ్ అజయ్, సీహె విజయ్ కాంస్య పతకాలను సాధించి జిల్లా ఖ్యాతిని చాటారు. మంగళవారం వీరిని అంతర్జాతీయ కరాటే మాజీ క్రీడాకారుడు కాశీహుస్సేన్, నిహారిక, క్రీడాసంఘాల ప్రతినిధులు, కోచ్‌లు అభినందించారు.

తహసీల్దార్‌కు సన్మానం

చంద్రుగొండ, ఫిబ్రవరి 13 : ఉద్యోగికి తన సర్వీసులో బదిలీ సర్వసాధారణమని, ఎక్కడ పనిచేసినా ప్రజల మన్ననలు పొందాలని వక్తలు అన్నారు. మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఇటీవల బదిలీపై వెళ్లిన తహసీల్దార్ సాజియా సుల్తానాను రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు, ముస్లిం మైనార్టీ పెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎల్ ప్రసన్న, కార్యాలయ సిబ్బంది రఘు, శ్రీను, పాషా, పద్మ, సైదా, ముస్లిం మైనార్టీ నాయకులు యాకూబ్‌అలీ, సాబీర్, నాబీద్ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే

రామవరం, ఫిబ్రవరి 13 : ప్రభుత్వం అమలుచేస్తున్న 200 యూనిట్ల కరెంట్ సబ్సిడీకి సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియను రామవరం 9వ వార్డులో విద్యుత్‌శాఖ అధికారులు మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్ మురళి దగ్గరుండి ఇంటింటికి తిరిగి ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తు చేసుకున్న రశీదులను పరిశీలించి వారి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులను ఫోన్ నంబర్‌తో కరెంట్ బిల్లుకు యాడ్ చేసి ఆన్‌లైన్‌లో అన్ని వివరాలను నమోదు చేశారు. 9వ వార్డు కౌన్సిలర్ మోరె రూప దగ్గరుండి ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు.

అచ్చంపేట ఏఎంసీ చైర్మన్‌పై దాడి అమానుషం

ఇల్లెందు, ఫిబ్రవరి 13: అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణ గుప్తపై దుండగులు చేసిన దాడి అమానుషమని, దోషులను వెంటనే అరెస్టు చేసి తగిన శిక్ష విధించాలని ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు అర్వపల్లి రాధాకృష్ణ, వాసవి క్లబ్ పట్టణ అధ్యక్షుడు పుల్లూరు సతీశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

భద్రాచలంలో..

భద్రాచలం, ఫిబ్రవరి 13: అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణ గుప్తాపై రైతులు దాడి చేయడం అమానుషమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్యవైశ్య సత్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళ అని కూడా చూడకుండా సాటి మహిళలు చీర లాగి ఈడ్చుకొని వెళ్లడం సభ్య సమాజం సిగ్గుపడే విధంగా ఉందన్నారు.

మహాశివరాత్రి జాతరకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 13 : మండల కేంద్రంలోని శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో మార్చి 7వ తేదీ నుంచి 9 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ... స్వామి దర్శనానికి క్యూలైన్‌లను ఏర్పాటు చేయాలని, జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ప్రదేశాన్ని కేటాయించాలన్నారు.

ఇంటర్నల్ మార్కులపై బృందాల పరిశీలన

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 13 : పదోతరగతి విద్యార్థులకు అందించే ఫార్మేటీవ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ) ఇంటర్నల్ మార్కుల జారీపై ఆయా పాఠశాలలో మార్కుల పత్రాలను మంగళవారం పరిశీలించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల పాఠశాలలను రెండు రోజులపాటు 20 పాఠశాలలో ఎఫ్ఏలను పరిశీలించటనున్నట్లు బృందం పర్యవేక్షకులు శ్రీప్రసాదరావు, పద్మావతి తెలిపారు. పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, మైనార్టీ గురుకులం, సూర్య, జవహర్ ప్రైవేటు పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మండలంలోని 20 పాఠశాలలో 13, 14 తేదీలలో పరిశీలన బృందాలు పర్యటిస్తాయని పేర్కొన్నారు.

మరణంలోనూ వీడని బంధం

భర్త మరణించిన కొద్ది గంటల్లోనే భార్య మృతి


సుంకరి రాములు, నర్సమ్మ (ఫైల్)

పినపాక, ఫిబ్రవరి 13: కడదాకా కలిసుందామని, చివరికి చితికైనా కలిసే వెళ్దామని అనుకున్నారో ఏమో ఆ వృద్ధ దంపతులు. ఆఖరుకు అలాగే చేసి చూపించినట్లుగా అనిపించారు. అలుమగల అనుబంధం మరణంలోనూ వీడనట్లుగా చూపించారు. అనారోగ్యాలతో నెలలకొద్దీ మంచాలపైనే ఇబ్బందులు పడుతున్న ఈ వృద్ధ దంపతులు ఒకరిని విడిచి మరొకరు ఉండలేక కొద్ది గంటల వ్యవధిలోనే కన్నుమూశారు. భర్త ఉదయం మరణించగా.. ‘నీవెంటే నేను’ అంటూ భార్య కూడా సాయంత్రం తనువు చాలించింది. కుటుంబసభ్యులు, బంధువులనేగాక గ్రామస్తులను కూడా కలిచివేసిన ఈ విషాద ఘటన మండల కేంద్రంలోని పినపాకలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. భద్రాద్రి జిల్లా పినపాక మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ సుంకరి రాములు (80) కొన్నేళ్లుగా అనారోగ్యంపాలై మంచం పట్టాడు. అతడికి కొన్నిరోజులు సపర్యలు చేసిన అతడి భార్య సుంకరి నర్సమ్మ (75) కూడా కొన్ని నెలల క్రితం అనారోగ్యంపాలై మంచానికే పరిమితమైంది. అయితే రాములు ఆరోగ్యం పూర్తిగా క్షీణించి సోమవారం ఉదయం మరణించాడు. అప్పటికే కోమాలో ఉన్న భార్య నర్సమ్మ కూడా సోమవారం సాయంత్రం మృతి చెందింది. కాగా, రాములు ఉమ్మడి పినపాక పంచాయతీకి రెండు పర్యాయాలు సర్పంచ్‌గా సేవలందించి సౌమ్యుడిగా పేరు పొందాడు. ఈ దంపతులకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మంగళవారం ఈ దంపతులకు అంత్యక్రియలు నిర్వహించడంతో బంధువులు, కుటుంబ సభ్యులు, పొరుగు గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో హాజరై కన్నీటి వీడ్కోలు పలికారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

పినపాక, ఫిబ్రవరి13: మండలానికి చెందిన మాజీ సర్పంచ్ సుంకర రాములు (80), భార్య సుంకరి నర్సమ్మ (75) మరణించడంతో వారి దహన సంస్కారాల కోసం వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని మంగళవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. మాజీ సర్పంచ్ గొగ్గలి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

డైరెక్టర్‌ను సన్మానిస్తున్న ఇంజినీర్ల సంఘం ప్రతినిధులు

పాల్వంచ, ఫిబ్రవరి 13 : టీఎస్ జెన్కో డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను డైరెక్టర్(థర్మల్) బి.లక్ష్మయ్య ఆవిష్కరించారు. మంగళవారం కేటీపీఎస్ సందర్శనకు వచ్చిన డైరెక్టర్‌ను అసోసియేషన్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. యూనియన్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను డైరెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో కేటీపీఎస్ సీఈలు వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రావు, శ్రీనివాసబాబు, ఎస్ఈలు రాజ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, ఇంజినీర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సామగ్రి ధ్వంసం

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 13 : ఆలయంలో చోరీ చేసేందుకు వచ్చి హుండీల్లో నగదు లేకపోవడంతో సుమారు రూ.25 వేల సామగ్రిని ధ్వంసం చేసిన ఘటన మండలంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని జానకీపురం శ్రీసత్యమ్మ తల్లి ఆలయంలో ఇద్దరు అపరిచిత వ్యక్తులు చోరీకి యత్నం చేశారు. రెండు హుండీలను పగులకొట్టి నగదు లేకపోవడంతో సామగ్రిని ధ్వంసం చేశారు. సుమారు రూ.25 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కొత్తగూడెం క్లూస్ టీం సభ్యులు ప్రదేశాన్ని పరిశీలించి, వేలిముద్రలను సేకరించారు. ఎస్సై షాహీనా కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎస్సైగా సుమన్ బాధ్యతల స్వీకరణ

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 13: బూర్గంపహాడ్ నూతన ఎస్సైగా కే.సుమన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్సైగా పనిచేసిన ఈ.రాజ్‌కుమార్ కొత్తగూడెం సీసీఎస్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో కొత్తగూడెం సీసీఎస్ నుంచి సుమన్ ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎస్సైకు మరో ఎస్సై నాగభిక్షం, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై సుమన్ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

అడవుల్లో విద్యుత్ తీగలు అమర్చొద్దు: ఎస్సై

గుండాల, ఫిబ్రవరి 13: అడవి జంతువుల వేట కోసం ఎవరైనా విద్యుత్ తీగలను అమర్చినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గుండాల సీఐ రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో కూంబింగ్‌కు వెళ్లిన ఓ కానిస్టేబుల్ అడవిలో కరెంట్ తీగలు తగిలి ప్రాణాలు కోల్పోయాడని అన్నారు. అందుకని ఎవరైనా అడవిలో కరెంట్ తీగలు ఏర్పాటు చేసినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి మృతి

రాంబాబు (ఫైల్)

దమ్మపేట, ఫిబ్రవరి 13 : బీఆర్ఎస్ నాయకుడు, బీసీ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ జొనెబోయిన రాంబాబు మంగళవారం ఆకస్మికంగా మృతిచెందాడు. మండలంలోని ముష్టిబండకు చెందిన రాంబాబు గుండెలో నొప్పిగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు సత్తుపల్లి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షులు రావు జోగేశ్వరరావు, జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు నివాళులర్పించారు.

యాష్ ట్యాంకర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

పినపాక, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలోని మల్లారం మూలమలుపు వద్ద మరో ప్రమాదం చోటుచేసుకుంది. మణుగూరు - ఏటూరునాగారం ప్రధాన రహదారిపై మల్లారం మలుపు వద్ద బీటీపీఎస్ నుంచి యాష్ లోడుతో తాండూరు వెళుతున్న ట్యాంకర్ మంగళవారం సాయంత్రం రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ప్రమాదాన్ని స్థానికులు గమనించిన 108 వాహనానికి, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శివప్రసాద్, ఎస్సై వెంకటప్పయ్యలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు. డ్రైవర్ మణుగూరు ఆస్పత్రికి తరలించారు. సీఐ ఆదేశాల మేరకు పోలీసులు ఆ మూలమలుపు వద్ద వేగనియంత్రణ డ్రమ్ములను ఏర్పాటుచేశారు.

రికార్డుల పరిశీలన

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 13: మండలంలోని రామచంద్రునిపేట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో టెన్త్ విద్యార్థుల ప్రగతి రికార్డులను ఎఫ్ఏ-4 మార్క్స్ మానిటరింగ్ టీం లీడర్ ఎం మోతీర్ పరిశీలించారు. మంగళవారం పాఠశాలను సందర్శించి తొలుత విద్యార్థుల నోటుపుస్తకాలు, మార్కుల వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం డీ వీరమ్మ, టీం మెంబర్లు ప్రేమ్‌కుమార్, ఆంజనేయులు, నాగేశ్వరరావు, సత్యనారాయణ, పీఎం ప్రసాద్, వీరన్న, పొట్టయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘గృహ జ్యోతి’ పథకం సర్వే

అశ్వారావుపేట, ఫిబ్రవరి 13 : మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో గృహ జ్యోతి పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం డిస్కం అధికారులు మంగళవారం ఇంటింటి సర్వే ప్రారంభించారు. విద్యుత్ శాఖ సిబ్బంది బృందాలుగా క్షేత్రస్థాయిలో 200 యూనిట్ల లోపు వినియోగించే వారి వివరాలు సేకరిస్తున్నారు. సర్వేను డిస్కం ఏడీఈ వెంకటేశ్వర్లు పర్యవేక్షిస్తున్నారు.

కొనసాగుతున్న మాఘమాసం పూజలు


పూజల్లో అర్చకులు, భక్తులు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 13 : జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ఎంజీరోడ్‌లోని శ్రీ విజయవిఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో మాఘమాసంను పురస్కరించుకొని మంగళవారం 4వ రోజు శ్రీ ఛాయా ఉషాపద్మినీ సమేత సవితృ సూర్యనారాయణ స్వామికి పూజలు నిర్వహించారు. 93మంది భక్తులు గోత్రనామాలతో పూజలు చేయించుకున్నారు. ఆలయ ఈవో సులోచన, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.